ప్రజాశక్తి
ఆదివారం 26 మార్చి 2023 5
అనంతపురం

మహిళా సదస్సులో ప్రసంగిస్తున్న హైకోర్టు, జిల్లా జడ్జిలు వెంకటశేషసాయి, డి.రమేష్

వ్యవసాయశాఖలో ఏం జరుగుతోంది..!

◆ కొనసాగుతున్న రహస్య విచారణ ◆ బయటకు పొక్కకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా వ్యవసాయ శాఖలో ఏమి జరుగుతోందన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వ్యవసాయ శాఖలో ముందు నుంచి అనేక ఆరోపణలు వెల్లువెత్తుతూ వస్తున్నాయి. వాటిపై ఉన్నతాది .కారులను విచారణాధికారులు నియమిస్తున్నారు. ఈ అధికారులు రావడం రహస్య విచారణలు జరపి, వెళ్లిపోవడంతోనే సరిపోతోంది. విచారణ అనంతరం ఎవరిపైనా చరర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. అంతక మునుపు జెడిఎ మహిళా ఉద్యోగినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారన్న ఆరోపణలు రావడమే కాకుండా బాధితులు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో విత్తన కొనుగోళ్లపైనా పెద్దఎత్తున ఆరోపణలొచ్చాయి. దీంతో ఆ అధికారిని వేరే జిల్లాకు బదిలీ చేశారు. దీనిపైనా విచారణకు ఒక అధికారిని నియమించారు. ఆ అధికారి విచారణలో ఏమీ తేల్చారన్నది ఇప్పటికీ తేలని రహస్యంగానే ఉంది. ఆయన తరువాత మరో అధికారి వచ్చి వెళ్లారు. ఆ తరువాత వచ్చిన అధికారిపైనా అదే రకమైన ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందినట్టు సమాచారం. అయితే విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. డబ్బుల పంపిణీలోనూ తేడాలొచ్చి కార్యాలయంలోనే అధికారి ఛాంబర్‌లో కొంతమంది సిబ్బంది ఏకంగా కొట్టుకునే స్థాయి వరకు వెళ్లినట్టు ఆరోపణలొచ్చాయి. తరువాత ఏమీ జరగనట్టు ఎవరికి వారు సర్దిజెప్పేకునే ప్రయత్నం చేశారు. కణేకల్ సీడ్ ఫామ్‌లో కోట్ల రూపాయాలు అవినీతి జరిగినట్టు ఆరోపణలు రావడంతో దీనిపై కమిటీని వేశారు. కమిటీ విచారణలోనూ అవినీతి తేలింది. కోట్లలో అవినీతి జరిగినట్టు తేలినా ఇప్పటి వరకు చర్యలెవరిపైనా లేవు. ఇలా వరుసగా ఒక దాని తరువాత ఒకటి ఆరోపణలొస్తున్నా కేవలం విచారణ కమిటీలకే పరిమితమవుతోంది. దీంతో ఆ శాఖలో ఏమి జరుగుతోందో అన్నది వ్యవసాయ శాఖలో సర్వత్రా చర్చ నడుస్తోంది.

మరోమారు రహస్య విచారణ

తాజాగా శుక్రవారం నాడు కూడా వ్యవసాయ శాఖలో జరుగుతున్న పరిణామాలపై ఒక అధికారి విచారణకు విచ్చేశారు. ప్రధాన కార్యాలయంలో విచారణ చేపడితే విషయం బయటకు పొక్కుతుందన్న ఉద్దేశంతో మరోచోట రహస్య విచారణ చేపట్టారు. ఈ విచారణ ఏ అంశంపై జరిగిందన్న విషయాన్ని ఏ మాత్రం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. విచారణాధికారి సైతం పెదవి విప్పకపోవడం గమనార్హం. ఉద్యోగ బదిలీల్లో నిబంధనలు పాటించడం లేదన్న ఒక అధికారి ఫిర్యాదుపై విచారణ ప్రస్తుతం సాగుతున్నట్టు సమాచారం.

ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వులను సైతం ఖాతర్ చేయకుండా మరొకరికి ఆ స్థానంలో నియమించడం పట్ల బాధతుడు ఒకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ సాగినట్టు ఆ శాఖలో చర్చ సాగుతోంది.

దేశ ప్రగతిలో మహిళల పాత్రకీలకం

హైకోర్టు న్యాయమూర్తి ఎ.వెంకట శేషసాయి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

దేశ ప్రగతిలో మహిళల పాత్ర ఎంతో కీలకం అని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, హైకోర్టు న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి పేర్కొన్నారు. రాయదుర్గం మండల పరిధిలోని 74 ఉడేగోళం మద్దాన్నేశ్వర స్వామి కళ్యాణ మండపంలో శనివారం ఉదయం మహిళా సాధికారత సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు జడ్జి వెంకటశేషసాయి హాజరై ప్రసంగించారు. హక్కుల గురించి మహిళలు తెలుసుకోవాలన్నారు. మహిళా సాధికారిత అంటే కుటుంబ, దేశ సాధికారత అని అర్థం అన్నారు. మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. జిల్లాలో బసివినుల వ్యవస్థను రూపుమాపి వారి జీవితాలను మెరుగుపరిచేందుకు జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప చేస్తున్న కృషిని అభినందించారు. హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన జడ్జి డి.రమేష్ మాట్లాడుతూ బాలికలపై అత్యాచారయత్నం జరిగిన ఘటనలకు సంబంధించి 80 శాతం పోలీసుల దష్టికి రావడం లేదన్నారు. పిల్లలకు మంచి, చెడులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు. జస్టిస్ శ్యాంసుందర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్పీ డా॥ఫక్కీరప్ప మాట్లాడుతూ జిల్లాలో వెల్ఫేర్ శాఖ సహకారంతో పరిశీలన చేయగా జిల్లాలో వేలమంది జోగిను, మాతంగి, బసివినులు దీన స్థితిలో ఉన్నట్లు తేలిందని జిల్లా ఎస్పీ పకీరప్ప చెప్పారు. 2022 సంవత్సరంలో అనంతపురంలోని ఎస్ఆర్ఐటి కళాశాలలో మెగా క్యాంపులు నిర్వహించి వైద్య సేవలు అందించమన్నారు. అనంతరం ఆర్‌డిటి సంస్థ సహకారంతో 39 మంది బసివినిలకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు మంజూరైన రూ.1.17 కోట్ల మెగా చెక్కును హైకోర్టు జడ్జి బిసివినులకు అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బబిత, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి లావణ్య, కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్ రెడ్డి, తహశీల్దార్ మారుతి, న్యాయవాదులు ఆర్‌టి.జగన్మోహన్ రెడ్డి, అబ్దుల్ వహాబ్ రెహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా మెగా చెక్కును అందిస్తున్న ప్రభుత్వ విప్, జెడ్పీ ఛైర్పర్సన్, కలెక్టర్

వైఎస్సార్ ఆసరా సాయం

రూ.233.66 కోట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద లబ్ధిదారులకు రూ.233.66 కోట్లు సాయం అందిందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ భవనంలో జిల్లా స్థాయి వైఎస్సార్ ఆసరా నగదు బదిలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివద్ధి కోసం ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణ మాఫీ చేస్తోందన్నారు. ఎప్పటికప్పుడు వాయిదాలు చెల్లించే మహిళలు మాఫీ చేసిన సొమ్మును కుటుంబ అభివద్ధికోసం వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 31,229 సంఘాలకు రూ.236.66 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ఇందులో గ్రామీణ సంఘాలు 24,098 ఉండగా వారికి రూ.183.56 కోట్లు, పట్టణ సంఘాలు: 7131 ఉండగా వారికి రూ.53.10 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహితి, కోగటం విజయ్ భాస్కర్ రెడ్డి, నాటక అకాడమీ ఛైర్ పర్సన్ హరిత, పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్ భూమిరెడ్డి జాహ్నవి, జిల్లా గ్రంథాలయ ఛైర్ పర్సన్ ఉమాదేవి, వక్ఫ్ బోర్డు ఛైర్‌పర్సన్ రిజ్వాన్, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఆసరా లబ్ధిదారులు పాల్గొన్నారు.

జీవో 52ని రద్దు చేయండి : ఎఐబిఎస్ఎస్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 52 జీవోను తక్షణమే రద్దు చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ నాయక్, పి.బాబు నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఎఐబిఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల గిరిజనులు విద్యా, ఉద్యోగ, ఉపాధి, సామాజిక రంగాల్లో తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ప్రభుత్వాలు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంతో మరింత వెనుకబాటుకు గిరిజనులు నెట్టివేయబడతారని తెలిపారు. తక్షణం ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర నాయకులు రంగ్లా నాయక్, జిల్లా నాయకులు కిరణ్‌కుమార్ నాయక్, సుగుణబాయి, నరేష్ నాయక్, గోవిందు నాయక్, రాము నాయక్, ప్రసాద్ నాయక్, రామాంజినేయులు నాయక్, ధరమ్‌సింగ్ నాయక్, శ్రవణ్ నాయక్ పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

ఎడిసిసిబి ఛైర్ పర్సన్ లిఖిత

ప్రజాశక్తి-అనంతపురం

సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమని ఎడిసిసిబి ఛైర్‌పర్సన్ లిఖిత అన్నారు. శనివారం స్థానిక ఎడిసిసిబి ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో 124వ మహాజనసభ నిర్వహించారు. సీఈవో రాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ లిఖిత మాట్లాడుతూ సహకార బ్యాంకులు రాష్ట్రంలో కార్పొరేట్ బ్యాంకులతో పోటీపడుతూ రైతులకు, మహిళలకు, యువతీ యువకులకు చేదోడుగా నిలుస్తున్నాయని తెలిపారు. ఇటీవల సహకార చట్టంలో అనేక సవరణలు వచ్చాయన్నారు. ఆర్‌బికెలతో అనుసంధానం చేయడం, సొసైటీలు బలోపేతం అయ్యేందుకు చేయూతనివ్వడం, నాణ్యత ప్రమాణాలను పెంచడం, అనుకున్న లక్ష్యం దిశగా టర్నోవర్‌ను పెంచుతూ సమిష్టి కృషితో సిబ్బందిని పని చేయించడం వంటి లక్షణాలను అధిగమిస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంతో నూతన ఒరవడితో, కొత్త హంగులతో టెక్నాలజీ ఆధారంగా కంప్యూటర్ సేవలను పూర్తిస్థాయిలో అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిసిఒ ప్రభాకర్ రెడ్డి, సత్యసాయి జిల్లా బీసీవో నాయక్, డిడిఎం నాబార్డ్ అనురాధ, ఆప్కాబ్ జనరల్ మేనేజర్ కృష్ణారావు, బ్యాంకు పాలకమండలి వర్గ సభ్యుడు జనార్దన్‌రెడ్డి, రామాంజనేయులు, శంకర్ రెడ్డి, ప్రొఫెషనల్ డైరెక్టర్లు రమణమూర్తి, అబ్దుల్ రాఖీబ్, ఎడిసిసిబి జనరల్ మేనేజర్ సురేఖ రాణి, డిజిఎం సుఖదేవ్ బాబు, రవికుమార్ సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు మేనేజర్లు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

రెండు రోజులు తాగునీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్ : ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న కారణంగా నడిమివంక దగ్గర మెయిన్ పంపింగ్ లైనును మార్చవలసి ఉన్నందున నగరంలో రెండు రోజులపాటు తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఇన్‌ఛార్జి కమిషనర్ రమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 27, 28 తేదీలు రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. నగర ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

విజ్ఞాన్ పాఠశాలలో ఫేర్‌వెల్ డే

అనంతపురం : స్థానిక మూడో రోడ్డులోని శ్రీ సాయి విజ్ఞాన్ పాఠశాలలో 9వ తరగతి, పదవ తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ డే వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల యాజమాన్యం ఎంపీ శ్రీనివాసులు, కరుణాకర్ బాబు, ప్రిన్సిపల్ లావణ్య రామ్ విద్యార్థులకు క్రమశిక్షణ, ఉన్నత చదువులపై పట్టు ఎలా సాధించాలి అన్న అంశాలను వివరించారు. పై చదువులపై ఆసక్తి పెంచుకోవాలని, ఓర్పుతో నేర్పుతో నైపుణ్యంతో ముందుకెళితే గమ్యం సులువుగా చేరుకోవచ్చునని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ఫన్ గేమ్స్ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోక్షిత్ పాఠశాలలో స్పోర్ట్స్ వీక్ ముగింపు వేడుకలు

అనంతపురం : స్థానిక విన్సెంట్ ఫెర్రర్ కాలనీలోని మోక్షిత్ పాఠశాలలో ఆన్యువల్ స్పోర్ట్స్ వీక్-23 ముగింపు వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. విద్యార్థులకు ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి అనంతపురం డిప్యూటీ డీఈవో పద్మజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలు పాటలు చాలా అవసరం అన్నారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయాలని సూచనలు సలహాలు ఇచ్చి ఆశీర్వదించారు.అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

వైసిపి పతనం ఖాయం

సమస్యలు పరిష్కరించాలని నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

◆ ప్రజలు ఆ పార్టీని తిరస్కరిస్తున్నారు..
◆ ఎమ్మెల్సీ ఎన్నికలే ఇందుకు నిదర్శనం
◆ యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి పతనం ఖాయం అని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. లోకేష్ ఆధ్వర్యంలో చేపట్టిన యువగళం పాదయాత్ర ఉగాది మూడు రోజుల విరామం తర్వాత శనివారం నాడు మొదలైంది. 50వ రోజు ఓబుళదేవరచెరువు మండలంలో యాత్ర కొనసాగింది. శనివారం ఉదయం వణుకువారిపల్లి నుంచి యాత్ర ప్రారంభం అయ్యింది. అక్కడి నుంచి గాజుకుంట్లపల్లి, వైఎస్సార్ సర్కిల్, ఓబుళదేవచెరువు మీదుగా వేమారెడ్డిపల్లి గ్రామం వరకు పాదయాత్ర కొనసాగింది. సాయంత్రం వేమారెడ్డిపల్లి గ్రామంలో బహిరంగ సభ నిర్వహించారు. గాజుకుంట్లపల్లి వద్ద వేరుశనగ పంటను పరిశీలించారు. పంట చేతికందక తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. ఓబుళదేవచెరువులో ముస్లిం మైనార్టీలతో ముఖాముఖి నిర్వహించారు. అక్కడి నుంచి సున్నంపల్లి క్రాస్ విడిది కేంద్రం వరకు పాదయాత్ర చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో లోకేష్‌కు టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఆయా ప్రాంతాల్లో రైతులు, ప్రజలు వారి సమస్యలను వినతిపత్రాల ద్వారా లోకేష్ దృష్టికి తీసకెళ్లార. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనపై జనం విసిగిపోయారన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో జగన్ ఇంటికి వెళ్లక తప్పదని జోస్యం చెప్పారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను పట్టభద్ర ఓటర్లు ఛీకొట్టారని తెలిపారు. ఇక ఎమ్మెల్యేల కోటాలో 23 ఓట్లతో టిడిపి వైసిపిని ఓడించడం దేవుని స్క్రిప్ట్ అని పునరుద్ఘాటించారు. బలం లేకున్నా 7 ఎమ్మెల్సీ స్థానాలను గెలవాలన్న అత్యాసతో ముఖ్యమంత్రి భంగపడ్డారని ఎద్దేవా చేశారు. గెలవలేని స్థానంలో ఒక బిసి అభ్యర్థిని పోటీలో నిలబెట్టి ఆయన్ను బలిపశువును చేశారన్నారు. బిసిల నమ్మకద్రోహి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. యువగళం పాదయాత్రకు వస్తున్న జనాన్ని చూసి వైసిపి నేతల్లో వణుకు మొదలైందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో అన్ని వర్గాల వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుల్ రెడ్డి, టీడీపీ నాయకులు బోయపల్లి శివారెడ్డి, నిజాం, మల్లాపల్లి ఓబుల్ రెడ్డి, డాక్టర్ పొగాకు జాకీర్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, వెంకటరంగారెడ్డి, కంచి సురేష్, గంటా శ్రీనివాసులు, చికెన్ షాను, అంజినప్ప, ఆరీఫ్‌ఖాన్, షబ్బీర్, అంజన రెడ్డి, నారపరెడ్డి, కుమార్ రాయల్, సౌది నాగరాజు, సుధాకర్, ఎద్దుల కరుణాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్రమణ్యం స్వామి, అబ్బూ హుస్సేన్, వైదేహి, మస్తానమ్మ పాల్గొన్నారు.

యువగళంలో నారా రోహిత్

లోకేష్ యువగళం పాదయాత్రలో ఆయన సోదరుడు, సినీహీరో నారా రోహిత్ పాల్గొన్నారు. లోకేష్‌తో కలిసి నడిచారు. ప్రజలకు అభివాదం చేస్తూ ఉత్తేజిత పరుస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు నారా రోహిత్‌తో సెల్ఫీలు దిగారు.

యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌తో కలిసి నడుస్తున్న సినీ హీరో నారా రోహిత్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పది పరీక్షలు సజావుగా నిర్వహించుకుందాం

విద్యార్థులు నేలపై కూర్చోని పరీక్ష రాయకూడదు
అన్ని పరీక్ష కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయండి
ఆర్జేడీ, ఉమ్మడి అనంతపురం జిల్లా పరీక్షల అబ్జర్వర్ బి.ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పది పరీక్షలు సజావుగా నిర్వహించుకుందామని ఆర్జేడీ, ఉమ్మడి అనంతపురం జిల్లా పరీక్షల అబ్జర్వర్ బి.ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరిగే పదవ తరగతి పరీక్షల్లో ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చోకూడదని, ప్రతి పరీక్షా కేంద్రాలోనూ బెంచీలు తప్పకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శనివారం ఉమ్మడి అనంతపురం జిల్లాల డీఈవోలు, డీవైఈవోలు, ఎంఈవోలు, ఎసిలు, సిఎస్, డివోలతో వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో ప్రశ్నా పత్రం లీక్ కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఒక వేళ పేపర్ లీక్ అయితే అది ఏ విద్యార్థిది, ఏ సెంటర్ నుంచి లీక్ అయిందోనని నిమిషంలో తెలుసుకోనేలా టెక్నాలజీని ఉపయోగిస్తున్నామన్నారు. అలాంటి పనులు ఎవరూ చేయకూడదన్నారు. మొదట్లోనే విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపించాలన్నారు. ఆ తర్వాత విద్యార్థులను అనవసరంగా ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. ప్రతి సెంటర్లోనూ ఇద్దరు మహిళా ఇన్విజిలేటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మాయిలను మహిళా టీచర్లు మాత్రమే తనిఖీ చేయాలన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి మంచి వాతావరణం కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు ఆర్జేడీ, డీఈవోలు, ఎసిలు వస్తే వారికి స్నాక్స్ ఇవ్వకూడదన్నారు. స్నాక్స్ కోసం అటెండర్ బయటికి వెళ్తే అవాంచనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి సెంటర్లోనూ సిఎస్, డివో గతంలో పనిచేసిన వారు ఒక్కరైనా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సెంటర్లోనూ బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులు ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ సిబ్బంది ఒఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా పెట్టుకోనేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు వసతులు కల్పించకపోతే బాధ్యుతలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయివేట్ స్కూల్లో పరీక్ష కేంద్రం ఉంటే పరీక్షలు జరిగేటప్పుడు ఆ స్కూల్ సిబ్బందిని లోపలికి అనుమతించకూడదన్నారు. పరీక్షలు ప్రారంభం అయ్యేటప్పుడు డీవైఈవోలు, ఎంఈవోలు అందుబాటులో ఉండాలన్నారు. గతంలో పరీక్షల విధుల్లో సస్పెండ్ అయిన హెచ్ఎం-టీచర్లకు ఎలాంటి విధులూ కల్పించకూడదన్నారు. రెగ్యులర్ పరీక్షలతో పాటు ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా జరుగుతాయని, ఉదయం రెగ్యులర్, మధ్యాహ్నం ఓపెన్‌స్కూల్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇతర విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం లేకుండాస్కూల్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో సాయిరామ్, ఎసి గోవిందునాయక్, శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి డీఈవో మీనాక్షి, ఎసి నాగరాజు, డీవైఈవోలు, ఎంఈవోలు, సిఎస్, డీవోలు పాల్గొన్నారు.

వెబెక్స్‌లో మాట్లాడుతున్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం

◆ కార్మికులకు అన్యాయం చేస్తున్న మోడీ ప్రభుత్వం
◆ జీపుజాతా ముగింపులో సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ఐక్యంగా ఎండగడదామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ జిల్లాలో చేపట్టిన జీపుజాత శనివారం ముగిసింది. ఈ నెల 18న చేపట్టిన జీపుజాత తపోవనం మీదుగా నీలిమా సర్కిల్, ఆర్‌టిసి బస్టాండ్, శ్రీకంఠం సర్కిల్, కృష్ణ థియేటర్ సర్కిల్, తాడిపత్రి బస్టాండ్ వరకు సాగింది. అనంతరం తాడిపత్రి బస్టాండ్ వద్ద సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాల సవరించారు. నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ సంపదను దోచిపెట్టే విధంగా ఉందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాల మోడీ పాలనకు వ్యతిరేకంగా ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదామన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. ఆటో డ్రైవర్లు, హమాలీ కార్మికులందరికీ సమగ్ర చట్టం చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. యువతకు సంవత్సరానికి లక్ష ఉద్యోగాలు ఇస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీ నగరంలో లక్షల మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, అధ్యక్షులు బాబు, ఉపాధ్యక్షులు ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎర్రిస్వామి, లక్ష్మీ నరసమ్మ, వరలక్ష్మి, భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, శివప్రసాద్, నాగరాజు, హమాలీ యూనియన్ నాయకులు గౌరప్ప, ఆదినారాయణ, రాజన్న, వెంకటేశ్వర్లు, కుళ్లాయి స్వామి, సాంబశివ, వెంకటేశు, నాగేంద్ర, చలపతి, రవి, శివ పాల్గొన్నారు.

జీపుజాతా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు నాయకులు

మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న దృశ్యం

మధ్యాహ్న భోజనం తనిఖీ

ఉరవకొండ : విడపనకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, ఎంపిడివో శ్రీనివాసులు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న రాగి జావ, భోజన వసతులను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం నాణ్యతగా, రుచికరంగా అందజేయాలని మధ్యాహ్న భోజన సిబ్బందికి, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బసన్న, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్ రెడ్డి, విద్యా కమిటీ ఛైర్మన్ గిరిబాబు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు సుంకన్, నాయకులు కరణం భీమిరెడ్డి, దేశాయి సిద్ధార్థ, కో-ఆప్షన్ మెంబర్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని స్థానిక ఎస్ఆర్ పెట్రోల్ బంకు ఎదురుగా శ్రీ రాఘవేంద్ర గుంటూరు సెల్ఫ్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చే దానికోసం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెన్నఅహోబిలంలో పల్లకిసేవ

ఉరవకొండ : పెన్నహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు,పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి పల్లకిలో మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ్ కుమార్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రామతులసి, ఆలయ అర్చకులు ద్వారకానాథ్ స్వామి, బాలాజీ స్వామి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నార్పల : స్థానిక వాల్మీకి ఆలయ ప్రాంగణంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, మొరుసు భాస్కర్‌రెడ్డి బాలనాగి నరేష్, నార్పల యూత్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 50 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇంతకుముందు ఆపరేషన్లు చేయించుకున్న దాదాపు 85 మందికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు.

పంట కోత ప్రయోగం

ఆత్మకూరు : ఆత్మకూరు మండలం పి.యాలేరు గ్రామంలో రైతు గోపాల్‌రెడ్డి తోటలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ పర్యవేక్షలో శనివారం వేరుశనగ పంటకోత ప్రయోగం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.నీలిమ, ఎఎస్ఒ మమత, ఎఇఒ సుజిత, విజయకుమార్ రిలయన్స్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మార్కెట్ వేలం పాటలు వాయిదా

రాయదుర్గం : శనివారం జరగవలసిన కూరగాయల మార్కెట్ వేలం పాటలు వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత, మటన్ మార్కెట్ వేలం పాటలు శనివారం నిర్వహించాల్సి ఉండగా పరిపాలన కారణాల దృష్ట్యా వేలం పాటలను వాయిదా వేసినట్లు కమిషనర్ తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామన్నారు.

In the Court of the IIIrd Addl. Junior Civil Judge:Ananthapuramu (Excise Court)
O.S.No.32/2021
Between:
Andhra Pragathi Grameena Bank, rep.by its Chief Manager, P.T.C. Branch, Anantapuramu Town. ...Plaintiff
And
K.Prasad ...Defendant

Notice to Defendant
K.Prasad S/o K.Mallanna, R/o D.No.5-405, Sree Sathya Sai Nagar, Rajiv Colony, Anantapuramu

పై దావా నందు వాది బ్యాంకుకు రావలస్సి బాకీ మొత్తము రాబట్టుకొనుటకై ప్రతివాది పైన దావా దాఖలు చేసియున్నారు. కావున ప్రతివాది అయిన మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు 04-04-2023 న హాజరుకావలయును. లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించెదరని తెలపడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:04-04-2023.
B.Nagalingam
Advocate for Plaintiff,
Ananthapuramu, Cell:9440759948.

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.269/2021
యం.చంద్రశేఖర్‌రెడ్డి ... వాది
V/s.
జి.లక్ష్మీనారాయణరెడ్డి ... ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

జి.లక్ష్మీనారాయణరెడ్డి తండ్రి గూలి కేశవరెడ్డి, వ్యాపారం,తిమ్మాపల్లె గ్రామం, తాడిపత్రి (మం), అనంతపురం జిల్లా.

పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 1,03,160/-లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 1-5-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 1-5-2023
యం.జయభారత్‌రెడ్డి
యన్.రాఘవచార్యులు
వాది పరం న్యాయవాదులు
కర్నూలు.

ఫలితాలు దేనికి సంకేతం ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. సాధారణంగా ఎన్నికలు జరిగితే వచ్చే మార్చి నాటికి అసెంబ్లీ, లోక్‌సభకు ఎన్నికలు జరుగనున్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు పూర్తవనుంది. ఈ ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందు మండలి ఎన్నికలు జరిగాయి. అందులో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల ఫలితాలు గత వారంలో వెలువడ్డాయి. ఉపాధ్యాయ ఎన్నికల్లో వైసిపి బలపరచిన అభ్యర్థి రామచంద్రారెడ్డి గెలుపొందారు. పట్టభద్రుల ఎన్నికల్లో నువ్వా..నేనా అన్నట్టుగా సాగిన ఎన్నికల్లో చివరకు టిడిపి విజయం సాధించింది. ఈ విజయంపై వైసిపి నాయకులు అనేక ఆరోపణలు చేస్తున్నారు. ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయంటూ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిలు ఆరోపిస్తున్నారు. అయితే ఇతర నాయకులెవరూ దీనిపై ఎటువంటి స్పందన వినిపించలేదు. కాకపోతే ఈ ఫలితాలు ఒకరంగా వైసిపిని అంతర్మథనంలో పడేశాయి. 2019 నుంచి అన్ని ఎన్నికల్లోనూ ఎదురులేని విజయాలు సాధిస్తూ వచ్చింది. ఈ ఎన్నికల్లోనూ తిరుగులేని విజయం సాధిస్తామన్న ధీమాతో ఎన్నికల ముందు వరకు ఉంది. ఈ మేరకు ఎన్నికల్లో గెలుపు కోసం అవసరమైన అన్ని రకాల ప్రయత్నాలు సైతం చేసింది. అధికార బలంతోపాటు, ధనబలాన్ని ప్రయోగించింది. కాని ఫలితాలు మాత్రం భిన్నంగా రావడం అందరినీ విస్మయపరిచింది. ఈ ఫలితాలు దేనికి సంకేతమన్న ఆలోచనలోనూ నేతలు పడ్డారు. ఈ ఫలితాలను ఒకరకంగా ఎన్నికల ముందు జరిపే శ్యాంపుల్ సర్వేలా భావించాలా లేక ఏ రకంగా ఫలితాలను చూడాలో అంతుబట్టని విధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా సంక్షేమ పథకాలపైనే నమ్మకం పెట్టుకుని ఇంతకాలం ఉంటూ వచ్చిన వారికి ఈ ఫలితాలు ఉలికిపాటుకు గురిచేస్తున్నాయి. మరో ఏడాదిలోపు సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచి తిరిగి తమ స్థానాలను పదిలం చేసుకోవడానికి ఏ రకంగా వ్యవహరించాలన్న కసరత్తులు చేయాలన్న ఆలోచనల్లోనూ పడ్డట్టు కనిపిస్తోంది. ఇకపోతే ఈ ఫలితాలు నిరాశతో నాలుగేళ్లు గానున్న టిడిపి శ్రేణుల్లో మాత్రం కొంత ఉత్సాహాన్ని నింపిందనే చెప్పవచ్చు. పెద్దగా ఆశల్లేకుండానే బరిలో దిగినప్పటికీ వచ్చిన ఫలితాలు ఆశాజనకంగా రావడంతో నేతల్లో ఉత్సాహం కనిపిస్తోంది. ఇదే సమయంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్ర జిల్లాలోకి ప్రవేశించింది. ఈ యాత్రను జయప్రదం చేసేందుకు మరింత ఉత్సహంగా ముందుకు కదులుతున్నారు. మొన్నటి వరకు వరుస పరాజయాలతో నిరాశలోనున్న పార్టీ శ్రేణుల్లో ఇప్పుడు జోష్ కనిపిస్తోంది.

ఈ ఫలితాలు రాబోయే ఎన్నికల్లో తమకు సానుకూలంగా ఉన్నట్టు కనిపిస్తోందని చెబుతున్నారు. ఏది ఏమైనా మండలి ఎన్నికల ఫలితాలు ప్రభుత్వానికి ఒక హెచ్చరికలాగా ఉన్నాయన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకులు సైతం భావిస్తున్నారు. ఒకవైపు ఉద్యోగులు, మరోవైపు నిరుద్యోగులు ప్రభుత్వం పట్ల వ్యతిరేకంగా ఉన్నారన్నది స్పష్టంగా కనిపిస్తోందంటున్నారు. రాయలసీమలోని ఆరు జిల్లాల పరిధిలో 2.45 లక్షల మంది తమ ఓటును వినియోగించుకున్నారు. ఇంత పెద్దఎత్తున ఒక అభిప్రాయాన్ని తెలియజేసినట్టు స్పష్టమవుతోంది. ఈ ఫలితాలను విశ్లేషించుకుని అధికార పార్టీ తగిన జాగ్రత్తలు పాటించకపోతే రాబోయే రోజుల్లో మరింత నష్టాన్ని చవిచూడక తప్పదంటున్నారు.

లబ్ధిదారులకు ఆర్థికసాయం పంపిణీ

ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుత్తి

వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన తక్షణ ఆర్థిక సాయాన్ని మృతుల కుటుంబ సభ్యులకు కౌన్సిలర్ వరదరాజులు శనివారం పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో దండు పద్మావతి, పి.వన్నూరప్పలు అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చొరవతో కౌన్సిలర్ వరదరాజులు రెండు కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా పథకం మంజూరు చేయించారు. పథకం కింద తక్షణ సాయం రూ.10 వేలు చొప్పున మృతుల కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. బీమా సొమ్ము లబ్ధిదారుల ఖాతాలో జమవుతుందని కౌన్సిలర్ చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కెఎం. రంగనాయకులు, భాస్కర్ బాబు, వైసిపి నాయకులు లాల్‌రెడ్డి, స్టోర్ మస్తాన్, అరుణ్, లింగారెడ్డి, దేవేంద్ర, సచివాలయ సంక్షేమ కార్యదర్శులు సుమలత, గంగాధర్, ఉద్యోగులు అలీ అక్బర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామసుబ్బయ్య

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులు కాలానుగుణంగా వ్యవసాయ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని అనంతపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రామసుబ్బయ్య, రవికిషోర్‌లు పేర్కొన్నారు. శనివారం ఉరవకొండలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు, సర్పంచులకు, గ్రామస్థాయి వ్యవసాయ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు వారి వ్యవసాయ పొలాల్లో వేసవి దుక్కుల పనులు చేపట్టడం ద్వారా పంటలకు నష్టం కలిగించే క్రిమి, కీటకాలను నివారించవచ్చన్నారు. ప్రతి రైతూ వ్యవసాయ మందులను వాడే విధివిధానాలు తెలుసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలు, మిత్ర పురుగుల ప్రాధాన్యత, మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక రాబడులు సాధించే అంశాలపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతులు సాగుచేసిన పంటలకు ఏయే తెగుళ్లు సోకుతాయో, పంటలను ఆశించే పురుగులను ఎలా నివారించవచ్చునో వివరించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ, వ్యవసాయాధికారి శశికళ, సర్పంచులు నాగప్ప, లింగన్న, యోగేంద్ర రెడ్డి, రైతు భరోసా సిబ్బంది, రైతులు భీమేష్, వసికేరప్ప, లాలెప్ప పాల్గొన్నారు.

మెదడు గాయాల నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ జి.భాస్కర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్‌బాబు ఆధ్వర్యంలో జిల్లా పోలీసు శాఖ, ట్రాఫిక్ పోలీస్ శాఖ, ఆర్టీవో శాఖ, మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, డిడి ఫార్మా, ఇంటాస్ ఫార్మ సంయుక్త ఆధ్వర్యంలో అనంత నగరంలో మెదడుకు కలిగే గాయాల నివారణపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులతో, స్లోగన్లతో, పోస్టర్లతో, కరపత్రాలతో అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుంచి తెలుగు తల్లి విగ్రహం, అంబేద్కర్ విగ్రహం, సప్తగిరి సర్కిల్ నుంచి తిరిగి సాయి నగర్ మీదుగా ప్రభుత్వ వైద్య కళాశాల వరకు ర్యాలీని నిర్వహించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆచార్య డాక్టర్ కెఎల్ సుబ్రహ్మణ్యం, న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ జి.భాస్కర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ హనుమంతు మాట్లాడుతూ మన మెదడులో కలిగే ఆలోచనలను నియంత్రించుకుని అతివేగంగా డ్రైవింగ్ చేయకుండా, హెల్మెట్, సీటు బెల్టు, ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించగలుగుతామని తెలిపారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల కంటే భారతదేశంలో అతి వేగం కారణంగా, రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగా ఎక్కువమంది యాక్సిడెంట్లకు గురై మెదడు గాయాలకు గురవుతున్నారని తెలిపారు. అందుకే రోడ్డు భద్రతా ప్రమాణాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ ఆచార్య డాక్టర్ కెఎల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి న్యూరో సర్జరీ విభాగంలో ఉన్న సౌకర్యాలను ప్రజలు ఉపయోగించుకుని ప్రాణాలు కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ న్యూరో సర్జరీ విభాగ సెమినార్ హాల్లో నిర్వహించిన సదస్సులో

ర్యాలీ నిర్వహిస్తున్న మెడకల్ విద్యార్థులు

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవితేజ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాలను, మెదడుకు కలిగే గాయాలను నియంత్రించుకోవడంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆసుపత్రిలోని సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీవో ఆఫీసర్ సురేష్ నాయుడు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆచార్య డాక్టర్ జి.రఘునందన్, ఆర్ఎంఒ డాక్టర్ వైవి.రావు, కార్డియాలజీ విభాగాధిపతి సహచార్య, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ మనోరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో పౌష్టికాహార వారోత్సవాలు

ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందేలా చూడాలని ఎంపీపీ సునీత, సర్పంచి పార్వతి సూచించారు. శనివారం బుక్కరాయసముద్రంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పక్షోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిపి సునీత, సర్పంచి పార్వతి, మహిళా అధ్యక్షురాలు కొండమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఉమా శంకరమ్మ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలు, ఆకుకూరలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు మునగాకు తీసుకోవడం వల్ల రక్తహీనత లోపాన్ని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధనలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

శింగనమల : ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టిక ఆహారం తోనే పుట్టబోయే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. శనివారం శింగనమల వఅంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఎంపిపి యోగేశ్వరి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోతి,నాగమనెమ్మ, హేమావతి, అంగన్‌వాడీ లు పాల్గొన్నారు.

మంచి ఫలితాలతో బంగారు భవితకు బాటలువేద్దాం

రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ ఓబులేసు

ప్రజాశక్తి-ఉరవకొండ

పదవ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఓబులేసు పిలుపునిచ్చారు. ఉరవకొండలోని వాణి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ రఘురాములు ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులు శనివారం సరస్వతి పూజ నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. పరీక్షలు రాసే సమయంలో ఒత్తిడికి గురికాకుండా మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం ద్వారా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అట్టలు, పెన్నులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, పెన్నహోబిలం ఆలయ మాజీ ఛైర్మన్ అశోక్ కుమార్, ఉరవకొండ పిఎసిఎస్ డైరెక్టర్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరీక్షల సామగ్రితో విద్యార్థులు

రాహుల్ పై అనర్హత వేటు ప్రజాస్వామ్యంపై దాడి

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సోనియా శీనా

ప్రజాశక్తి-ఉరవకొండ

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటు ప్రజాస్వామ్యంపై దాడిగా కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా కార్యదర్శి సోనియా శీనా అన్నారు. శనివారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతదేశం కోసం ఎన్నో త్యాగాలను చేసిన రాహుల్ గాంధీ కుటుంబాన్ని నిత్యం అవమాన పరుస్తున్న కేంద్రంలోని అధికార బిజెపి అహంకారంతో, నిరంకుశత్వంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అదాని చేస్తున్న అక్రమాలపైన, నరేంద్ర మోడీకి, అదానీకి ఉన్న సన్నిహిత సంబంధాలపై రాహుల్ గాంధీ పార్లమెంటులో గట్టిగా నిలదీయడాన్ని జీర్ణించుకోలేని మోడీ ప్రభుత్వం రాహుల్‌పై కక్షసాధింపుకు పాల్పడుతోందన్నారు. అందులో భాగంగానే అనర్హత వేటు వేసిందన్నారు. ఇలాంటి సంఘటనలను దేశంలోని ప్రజాస్వామ్యవాదులు అందరు కూడా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. నియంతృత్వ విధానాలను అనుసరిస్తున్న బిజెపిని తరిమి కొట్టడానికి ప్రజలు తిరుగుబాటు చేయాలన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని ఓడించడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

వికె.వెంకట్రామిరెడ్డికి జెసి.ప్రభాకర్‌రెడ్డి నివాళి

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని వేములపాడు గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి వికె.వెంకటరామిరెడ్డి శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం వెంకట్రామిరెడ్డి పార్థివదేహానికి తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఎంచుకొని వారి కష్టాలు తీర్చారన్నారు. వెంకట్రామిరెడ్డి రైతు కూలీల తరపున, మండల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జెసి ప్రభాకర్ రెడ్డి తోపాటు టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, కులశేఖర్, నీలకంఠారెడ్డి, శ్యాంసుందర్, పలువురు టిడిపి నాయకులు నివాళులర్పించారు.

అనంతపురం : వెంకటరామిరెడ్డి పార్థివదేహానికి జిల్లా మాజీ సైనికులు నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వికె.రంగారెడ్డి, అనంతపురం జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కెప్టెన్ షేకన్న, ఆర్ఎస్.నాగరాజు, అబ్దుల్ ఖాదర్, నరసింహులు, సయ్యద్ ఖాజామొయిద్దీన్, బిఎ.హుస్సేన్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బంగారు నాణేల పేరుతో మోసం

రూ.2 లక్షల నగదుతో ఉడాయింపు

ప్రజాశక్తి-గుత్తి, పెద్దవడుగూరు

బంగారు నాణేలు విక్రయిస్తామని నమ్మబలికి నకిలీ నాణేలు ముట్టజెప్పి రూ.2 లక్షల నగదుతో దుండగులు ఉడాయించిన ఘటన గుత్తి పట్టణ శివారులోని ఓ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాదుకు చెందిన దీపికకు ఆన్‌లైన్ ద్వారా కొందరు పరిచయమయ్యారు. తమ వద్ద పురాతనమైన బంగారు నాణేలు ఉన్నాయని రూ.10 లక్షల విలువ చేస్తాయని, తక్కువ ధరకే విక్రయిస్తామని ఆమెను దుండగులు నమ్మించారు. గుత్తికి వస్తే నాణేలు విక్రయిస్తామని చెప్పారు. వారి మాయ మాటలు నమ్మిన దీపిక తన భర్తతో కలిసి గుత్తి సమీపంలోని ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని 44వ జాతీయ రహదారి పైకి వచ్చారు. నలుగురు దుండగులు రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చి 20 బంగారు నాణేలు ఉన్నాయని దీపిక, ఆమె భర్తకు అందజేసి వారి వద్ద నుంచి రూ.2 లక్షలు నగదు తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. దుండగులు వెళ్లిన తర్వాత దీపిక నాణేలను పరిశీలించగా రెండు బంగారు నాణేలు, 18 నకిలీవిగా గుర్తించారు. లబోదిబోమంటూ పెద్దవడుగూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు.

జెఎన్‌టియు ఫార్మసీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ పరిధిలో ఫిబ్రవరి, మార్చి-2023 సంవత్సరంలో నిర్వహించిన బీ.ఫార్మసీ మొదటి సంవత్సరం ఒకటవ సెమిస్టర్ ఫలితాలు శనివారం విడుదల చేసినట్లు జేఎన్టీయూ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య కేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జేఎన్టీయూ పరిధిలో మార్చి-2023లో నిర్వహించిన బి.ఫార్మసీ (ఆర్19), (ఆర్ 15) సప్లిమెంటరీ ఫలితాలు, బీ.ఫార్మసీ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్ 19), (ఆర్ 15) సప్లిమెంటరీ, ఫార్మా.డి మొదటి సంవత్సరం (ఆర్ 14) సప్లిమెంటరీ, ఫార్మా.డి మొదటి సంవత్సరం (ఆర్ 17) అడ్వాన్స్ సప్లిమెంటరీ, ఎం.ఫార్మసీ. మూడవ సెమిస్టర్ (ఆర్ 21) రెగ్యులర్ పలితాలు, ఎం.ఫార్మసీ, మూడవ సెమిస్టర్ (ఆర్ 17) సప్లిమెంటరీ పరీక్ష పలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యు యేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆచార్య బి.చంద్ర మోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియుఎ వెబ్‌సైట్ http://jntuaresults.ac.in ను సంప్రదించాలని తెలిపారు.

రమాదేవి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ సాయం

ప్రజాశక్తి-నార్పల

ప్రేమ పేరుతో మోసపోయి దారుణ హత్యకు గురైన బొందలవాడ గ్రామానికి చెందిన ప్రయివేటు టీచర్ కె.రమాదేవి కుటుంబానికి ప్రభుత్వం రూ.8.25 లక్షలు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఆర్డీవో మధుసూదన్ రమాదేవి తల్లిదండ్రులైన నారాయణమ్మ, నారాయణప్ప లకు రూ.4,12,500 నగదు వారి అకౌంట్‌కు నేరుగా చేరే విధంగా ప్రతిపాదన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు నారాయణస్వామి, ఆర్ఐ సందీప్, వీఆర్వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తక్షణ సాయం రూ.5 వేలు అందజేత

బాధిత కుటుంబ సభ్యులను డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారెడ్డి శనివారం పరామర్శించారు. రమాదేవి తల్లిదండ్రులకు బొందలవాడ మహిళా సంఘాల తరపున తక్షణ సాయం కింద రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడి ఈశ్వరయ్య, శ్రీనివాసులు, ఎపిఎం తిప్పమ్మ, సీసీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయి ట్రస్ట్‌కు మూడు స్ట్రెచర్స్ వితరణ

ప్రజాశక్తి -అనంతపురం

సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో 20 సంవత్సరాలుగా ఎంతో మంది నిరాశ్రయులకు, అనాథలకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న విషయం విధితమే. ఇప్పటి వరకు దాదాపు 1509 మందికి అంతిమ సంస్కారాలను నిర్వహించడంతో పాటు ఎంతో మంది నిరాశ్రయులను, వృద్ధులను ఆశ్రమాల్లో చేర్పించుట, ఎంతో మంది రోగులకు సహాయం అందిస్తున్నారు. అనాథ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించే క్రమంలో నలుగురు మోసేందుకు వీలులేని సందర్భాల్లో ఇద్దరి తోనే కార్యక్రమాలను పూర్తి చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని స్ట్రెచర్స్ కోసం రఘువీర్ టవర్స్ లోని అనంత సర్జికల్స్‌ను సంప్రదించారు. స్పందించిన వారు మంచి గేజ్‌తో రెండు స్టీల్ స్ట్రెచర్స్‌ను అనంత సర్జికల్స్ యజమాని సుంకర చంద్ర కాంత్ నాయుడు అందజేశారున. కార్యక్రమంలో సాయి ట్రస్ట్ నారాయణ నాయక్, రాఘవేంద్ర, విజయ కిరణ్, నవీన్ సామ్రాట్ పాల్గొన్నారు.

పరీక్షల సామగ్రి వితరణ

ప్రజాశక్తి-గార్లదిన్నె

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ, మాజీ విద్యా కమిటీ ఛైర్మన్, వైసిపి సీనియర్ నాయకుడు గట్టు రామక్రిష్ణారెడ్డి శనివారం పరీక్షల సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున నగదుతో పాటూ బహుమతులు అందజేస్తూ నూతన విద్యార్థులకు ప్రోత్సహిస్తున్నామన్నారు. దీనిని అలాగే కొనసాగిస్తూ వరుసగా రెండో సంవత్సరం ఆయన కుమారులు గట్టు నిరంజన్ రెడ్డి, గట్టు గోవర్ధన రెడ్డి 2023 బ్యాచ్ పదవ తరగతిలో 103 మంది పిల్లలకు పబ్లిక్ పరీక్షలకు కావలసిన సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ సుధా, ఉపాధ్యాయురాలు అనిత, చంద్రశేఖర్ నరేంద్ర పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను పూర్తి చేయండి

ప్రజాశక్తి-పుట్లూరు

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన వివరాలను పూర్తి చేయాలని ఎంపీడీవో యోగానందరెడ్డి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ గర్భిణులు, 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు, 6 నుండి 19 సంవత్సరాల పిల్లల వివరాలు యాప్‌లో నమోదు చేయడం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నారాయణమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

ఆత్మకూరు : ఆత్మకూరు మండల పరిధిలోని ముట్టాల మైట్ ఆసుపత్రిలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మైట్ ఆసుపత్రి పక్షవాతం, నరాల బలహీనత, శ్వాస సంబంధిత వ్యాధులకు పంచకర్మ చికిత్సలు అందించడంలో పేరుగాంచింది. 148 మంది దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు అందుకున్నారు. నాగార్జున, హిమాలయ, కేరళ, ఎవిఎన్ ఆయుర్వేద ఔషధ కంపెనీలు భాగస్వాములై రోగులకు ఉచితంగా ఔషధాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్స్ సంస్థ సిబ్బంది నాగార్జునరెడ్డి, ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-ఉరవకొండ

వచ్చే ఏడాది నుంచి నెలకు రూ.1000 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం పొందటానికి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు నిస్వార్థ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ వెంకట్ తెలిపారు. నిస్వార్థ సేవా సంస్థ ఆధ్వర్యంలో 16 నెలలుగా విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చారు. 12 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా ఐదుగురు ఉపకార వేతనం పొందటానికి అర్హత సాధించినట్లు టి.వెంకట్ తెలిపారు. ఎంపికైన వారిలో తరుణ్ కుమార్, చిన్న ముష్టూరు శివకుమార్, సాయి చైత్ర తదితరులు ఉన్నారు. అర్హత కనబరిచిన విద్యార్థులను పలువురు ప్రశంసించారు. ఉచిత శిక్షణ ఇచ్చి విద్యార్థులు పరీక్షలకు అర్హత సాధించేందుకు కృషిచేసిన నిస్వార్థ సేవకులు తాటికొండ వెంకట్‌ను కాకతీయ సేవాసమితి అధ్యక్షులు మాలపాటి శ్రీనివాసులు అభినందించారు.